విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలి

● రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

రాంనగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15 శాతం నిధులు కేటాంచాలని, సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతానిని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో 'రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15శాతం నిధులు కేటాయించాలి' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్య పరిరక్షణకు ఉద్యమించాలని కోరారు. ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మనువాద భావజాలాల వల్ల విద్యకు బడ్జెట్ కేటాయింపులో అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఎంవీ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి ఆర్.వెంకట్‌రెడ్డి, బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 15 శాతం నిధులు కేటాయించాలన్నారు. బడ్జెట్ కేవలం 7 శాతం నిధులు కేటాయించి అన్యాయం చేశారన్నారు.

పెండింగ్ ఫీజులు, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి: పీడీఎస్‌యూ

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు పి.మహేష్ డిమాండ్ చేశారు. సోమవారం మార్క్స్ భవన్‌లో గ్రేటర్ హైదరాబాద్ పీడీఎస్‌యూ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగానికి బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఇవ్వాల్సిన రూ.7,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నవీన్, శ్రీనివాస్, నాయకులు ఆసిఫ్, మౌనిక, గౌతమ్, జాన్సీ, జాహ్నవి, రహీం తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 26 నుంచి మార్చి 6వ తేదీ వరకు జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను టీటీడీ ఈవో జె.శ్యామలరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం అంకురార్పణ, బుధవారం ధ్వజారోహణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. మార్చి 2న గరుడ వాహనం, 5న రథోత్సవం, 6న చక్రస్నానం నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా విస్తృత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆలయ ఆవరణలో చలువపందిళ్లు ఏర్పాటుచేసి అందంగా రంగవల్లులు తీర్చిదిద్దాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో రమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లతో ప్రతిభావంతులకు ప్రోత్సాహం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ కొలమానంగా అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుందని, అర్హులైన ప్రతిభావంతులకు స్కాలర్ షిప్ అందిస్తున్నామని నయంత లీడర్‌షిప్ సభ్యులు ఎయిట్‌రోడ్స్ సంస్థ మాజీ ఫౌండర్ రాజ్ దుగ్గర్ తెలిపారు. టీహబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నయంత ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ రంజన్ బెనర్జీ మాట్లాడుతూ ఏప్రిల్ వరకు దరఖాస్తుల స్వీకరిస్తామని, ఆగస్టు నుంచి పుణేలో ఉన్న తాత్కాలిక యూనివర్సిటీలో తరగతులు ప్రారంభం అవుతాయన్నారు. వర్సిటీ అడ్మిషన్స్ డీన్ ప్రొఫెసర్ పార్థసారథి మాట్లాడుతూ ప్రతిభావంతులకు అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ ఉంటుందన్నారు.



ఐఐటీహెచ్‌లో కంప్యూటేషనల్ కేమిస్ట్రీ కేంద్రాన్ని ప్రారంభించిన హైడెల్‌బర్గ్ యూనివర్సిటీ-ఐఐటీహెచ్ అధ్యాపక బృందం

హైదరాబాద్‌ను ఫార్మా హబ్‌గా మారుస్తాం

కంది, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌ను ఫార్మా హబ్ గా మార్చి, విద్యార్థులకు ఆధునాతన రసాయన విద్యను అందిస్తామని టీఐఎఫ్ఆర్ (టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంట్ అండ్ రీసెర్చ్) హైదరాబాద్ కేంద్ర డైరెక్టర్ కృష్ణమూర్తి అన్నారు. ఇండో-జర్మన్ సహకారంతో కంప్యూటేషనల్ కెమిస్ట్రీపై పరిశోధనలు జరిపేందుకు సోమవారం సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌తో జర్మనీలోని హైడెల్‌బర్గ్ యూనివర్సిటీ భాగస్వామ్యమైంది. రసాయన పరిశోధన, విద్యా మార్పిడి, ఉపాధి, ఆవిష్కరణలు, సాంకేతికత బదిలీ కోసం ఐఐటీహెచ్‌లో ఐదు రోజుల పాటు ప్రత్యేక వర్క్‌షాప్ హబ్‌ను నిర్వహిస్తున్నారు. ఇందుకోసం హైడెల్‌బర్గ్ విశ్వవిద్యాలయ ఇద్దరు ఉపాధ్యక్షుల నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ప్రతినిధి బృందం ఈనెల 28 వరకు ఐఐటీహెచ్‌లో ఉంటూ ఇక్కడి విద్యా విధానాలు, పరిశోధనలపై అధ్యయనం చేయనున్నారు. ద్వైపాక్షిక- బహుపాక్షిక అకాడెమీ-ఇండస్ట్రీ భాగస్వామ్యాలను ప్రోత్సహించడం హబ్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఐఐటీహెచ్ అధికారులు వెల్లడించారు. ఆధునిక రసాయన శాస్త్రంలో విద్య, శిక్షణ, క్రాస్-కల్చరల్ లెర్నింగ్‌ను ప్రోత్సహించడం, మాస్టర్స్, గ్రాడ్యుయేట్ స్థాయిలలో దీర్ఘకాలిక ఇండో-జర్మన్ మార్పిడి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం ఒక ముఖ్య చొరవని ఐఐటీహెచ్ డీన్ నరహరిశాస్త్రీ తెలిపారు. రెండు విద్యా సంస్థల మధ్య స్థిరమైన శాస్త్రీయ, సాంకేతిక ఆర్థిక భాగస్వామ్యానికి మార్గం సుగమం చేస్తూ ఈ సహకారాన్ని నడిపించడంలో పరిశ్రమ, ప్రభుత్వ మద్దతు కీలకం ఆయన ఆకాంక్షించారు.

డిజిటల్ అరెస్టు కేసులో తమిళనాడుకు చెందిన ముగ్గురి అరెస్టు

● బాధితుడి నుంచి రూ.1.38 కోట్లు బదిలీ చేయించుకున్న ముఠా

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టు పేరుతో డబ్బులు కొల్లగొట్టిన ఓ ముఠా సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు చిక్కింది. ఈ కేసులో ఈ నెల 21న తమిళనాడులోని నమక్కల్‌కు చెందిన గోకుల్ మారుతచాల మూర్తి (24), జాఫర్ షరీఫ్ (23), షారుఖాన్ (30)లను అరెస్ట్ చేశారు. వారి నుంచి మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సైబర్ క్రైం పోలీసుల వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన బాధితుడికి ముఠాలోని ఒకరు ఫోన్ చేసి తాను ఎస్‌బీఐ ప్రతినిధినని చెప్పి.. మీపై యాంటీ మనీలాండరింగ్ కేసు నమోదైందన్నాడు. అదే సమయంలో వాట్సాప్ కాల్ ద్వారా ఫోన్ చేసి ముంబై క్రైం పోలీస్ ఆఫీసర్‌గా మాట్లాడి ఆయనను తీవ్ర భయాందోళనలకు గురి చేశాడు. బాధితుడి ఆధార్ కార్డును మనీలాండరింగ్ కార్యకలాపాలకు వాడుకున్నట్లు తేలిందని బెదిరించారు. ఈ నేపథ్యంలో బాధితుడు వారికి రూ.1,38,60,000 వివిధ బ్యాంకుల నుంచి బదిలీ చేశాడు. ఆ తర్వాత మోసపోయానని గుర్తించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టారు. బాధితుడు బదిలీ చేసిన నగదులో రూ.9.60లక్షలు గోకుల్ మారుతచాల మూర్తికి చెందిన ఫెడరల్ బ్యాంకు అకౌంట్‌కు వెళ్లినట్లు గుర్తించారు. ఈ డబ్బులను రాహుల్ అనే వ్యక్తి బ్యాంకు నుంచి విత్‌డ్రా చేసుకున్నాడు. గోకుల్ తన బ్యాంకు అకౌంట్ వివరాలు, పాస్‌బుక్, ఏటీఎం కార్డు, చెక్‌బుక్‌లను జాఫర్ షరీఫ్, షారుఖాన్‌లకు కమీషన్ మీద ఇచ్చాడు. వీరంతా కలిసి ముఠాగా ఏర్పడి బాధితుడి నుంచి డబ్బులు బదిలీ చేయించుకొన్నారు. ముఠా సభ్యులు వాట్సాప్, టెలిగ్రామ్ యాప్‌లను వాడుతూ తాము పోలీసు అధికారులమని చెప్పి మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష

రంగారెడ్డి జిల్లా కోర్టు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో వంచించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 20ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ రంగారెడ్డి 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి తీర్పునిచ్చారు. పీపీ మంజులాదేవి కథనం ప్రకారం.. కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పులిమామిడికి చెందిన తిమ్మగళ్ల శ్రీనాథ్ (21) ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని ఓ బాలికను నమ్మించాడు. మాయమాటలు చెప్పి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత పెళ్లి చేసుకోకుండా తిరస్కరించడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదుచేసింది. పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండుకు తరలించారు. కేసు పూర్వాపరాలను విచారించిన 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎమ్.వాణి నిందితుడు శ్రీనాథ్‌ను దోషిగా నిర్ధారిస్తూ 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5వేలు జరిమానా విధించారు. బాధితురాలికి రూ.3లక్షల నష్ట పరిహారం చెల్లించాల్సిందిగా తీర్పు వెల్లడించారు.

శివరాత్రికి ముస్తాబైన శైవక్షేత్రాలు

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పెద్ద ఎత్తున ఏర్పాట్లు



భోలక్‌పూర్‌లోని భవానీ శంకర ఆలయం వద్ద షామియానాలు, ఇతర ఏర్పాట్లు

ముషీరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రికి ముషీరాబాద్ నియోజకవర్గంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. భారీ స్వాగత వేదికలు, ఆలయం వద్ద టెంట్‌లు ఏర్పాటు చేశారు. ముషీరాబాద్ గౌరీ శంకర ఆలయం, భోలక్‌పూర్‌లోని ప్రసిద్ధిగాంచిన భవానీ శంకర ఆలయం, గాంధీనగర్‌లోని సంగమేశ్వర ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. శివపార్వతుల కల్యాణానికి భారీ వేదికలను ఏర్పాటు చేశారు. భవానీ శంకర ఆలయం వద్ద బారికేడ్లు ఆలయం బయట నుంచి గర్భగుడి వరకు ఏర్పాటు చేశారు. ఉపవాస దీక్షలు ముగించే భక్తులకు వివిధ రకాల పండ్లను పంపిణీ చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.



శివాలయం చౌరస్తా వద్ద విద్యుత్ దీపకాంతులతో గౌరీశంకర ఆలయం

గోల్నాక డివిజన్‌లో..



వీరన్నగుట్టలోని శ్రీ మహాశివాలయం వద్ద ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గోల్నాక, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకొని గోల్నాక డివిజన్‌లోని శివాలయాలతో పాటు వివిధ దేవాలయాల వద్ద ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను చేశారు. డివిజన్‌లోని వీరన్నగుట్టలోగల శ్రీమహాశివాలయాన్ని రంగులువేసి షామియానాల ఏర్పాటు చేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి భీమనబోయిన నర్సింగ్‌రావు యాదవ్ తెలిపారు. గోల్నాక శ్రీలక్ష్మీనగర్‌లోని శ్రీనల్లపోచమ్మ దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. బుధవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో శివకల్యాణం, సదర్‌పటం, మల్లన్న ఉక్కు గొలుసులు తెంపుట, అగ్నిగుండం వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొమ్మిడి గోపాల్‌రెడ్డి తెలిపారు. అలాగే డివిజన్‌లోని కమలానగర్‌లోగల శివాలయం, నెహ్రూనగర్‌లోని ఉమామహేశ్వర దేవాలయం, మారుతినగర్, తదితర బస్తీలలోని ఆలయాలు శివరాత్రి పండుగకు ముస్తాబయ్యాయి.

పెద్ద ఎత్తున ఏర్పాట్లు



గౌరీ శంకర ఆలయ దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశాం. ఎండలు విపరీతంగా ఉండడం వల్ల భక్తులకు ఆటంకం కలగకుండా ఆలయ ప్రాంగణంలో టెంట్‌లు వేయించాం. ఉపావస దీక్ష ముగించే భక్తులకు తీర్థప్రసాదాలను అందజేస్తాం. స్వామివారి కల్యాణానికి ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ తదితరులు హాజరవుతారు.

- పి. శ్రీధర్‌చారి, గౌరీశంకర ఆలయ కమిటీ చైర్మన్

శివపార్వతుల కల్యాణానికి భారీ వేదిక



భవానీ శంకర ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు వేల సంఖ్యలో ప్రజలు హాజరుకానుండడంతో భారీ వేదికను ఏర్పాటు చేశాం. జాగరణ చేసే భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశాం. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేశాం.

- జ్యోతి, భవానీ శంకర ఆలయ ఈవో



భోలక్‌పూర్‌లోని భవానీ శంకర ఆలయ గర్భగుడి



ముషీరాబాద్ నుంచి వైశ్రాయిహోటల్ చౌరస్తాకు వెళ్లే మార్గంలో డిజిటల్ విద్యుత్ దీపాల స్వాగత తోరణం

నేటి నుంచి భవానీ శంకర ఆలయంలో..

ముషీరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ దేవునితోటలోని ప్రసిద్ధిగాంచిన భవానీశంకర దేవాలయంలో మంగళవారం నుంచి మహాశివరాత్రి మహోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ కార్యనిర్వాహణ అధికారి బి.జ్యోతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం తెల్లవారుజాము 5గంటల నుంచి గణపతి పూజ, అఖండ దీపారాధన, అభిషేకాలు, బిల్వార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 26వ తేదీ తెల్లవారుజామున 4గంటలకు స్వామివారికి రుద్రాభిషేకం, రాత్రి 7.15 నిమిషాలకు స్వామి వారి కల్యాణ మహోత్సవం, అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తామని తెలిపారు. 27వ తేదీన ఉదయం 5గంటల నుంచి రాత్రి 7గంటల వరకు స్వామి వారికి పల్లరసాల అభిషేకం, చండీ హోమం, తైలాభిషేకం, అన్నాభిషేకం, రాత్రి స్వామివారికి వసంతోత్సవం తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

రేపు వేంకటేశ్వరాలయంలో...

చిక్కడపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణలోని శివాలయంలో మహాశివరాత్రి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక వంశీయుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో అన్నపూర్ణ తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక అభిషేకాలు జరుగుతాయని వివరించారు. ఈ సందర్భంగా శివాలయం ముందుప్రత్యేకంగా తడకల పందిరి ఏర్పాటు చేశారు. చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో ఉన్న శివాలయంలో ప్రత్యేకపూజలు అభిషేకాలు నిర్వహించనున్న క్రమంలో భక్తులు, ఉపవాసం ఉన్నవారందరికీ ప్రసాదం అందించనున్నట్లు ఆలయ చైర్మన్ జానకి సుధాకర్, ఈవో మాచర్ల దేవనాథం తెలిపారు. మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, ఏకవార రుద్రాభిషేకాలు, రాత్రి శ్రీ శివపార్వతుల కల్యాణం జరుగుతుందని తెలిపారు. ఆర్టీసీక్రాస్‌రోడ్ శ్రీ లక్ష్మీగణపతి దేవాలయం ప్రాంగణంలోని శ్రీ పార్వతిక్షీరలింగేశ్వర స్వామి మందిరంలో శివరాత్రి ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ చైర్మన్ మారిశెట్టి నర్సింగ్‌రావు, ఈవో లక్ష్మారెడ్డి వివరించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత పాటించేలా మునిసిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ సూచించారు. కవాడిగూడ డివిజన్ ఉన్నికోటలో నూతనంగా నిర్మించనున్న స్లాబ్ నిర్మాణ పనులను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ కోటీ పది లక్షల రూపాయల వ్యయంతో కమ్యూనిటీ హాల్‌ను జీప్లస్ వన్‌గా నిర్మిస్తున్నామని తెలిపారు. ఉన్నికోట వాసులు శుభకార్యాలు చేసుకోవడానికి ఈ కమ్యూనిటీహాలు ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన రాష్ట్ర నాయకులు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వల్లాల శ్యామ్‌యాదవ్, ఎన్‌డీ సాయి కృష్ణ, నగర నాయకులు వల్లాల శ్రీనివాస్‌యాదవ్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, రాజశేఖర్‌గౌడ్, డాక్టర్ శ్రీహరి, రవియాదవ్, రాజుయాదవ్, రాజేష్, నర్సింగ్, సురేష్, శివ, వెంకటేష్, మాధవి, రూప, మంజుల, బీఆర్ఎస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.



కమ్యూనిటీహాలు స్లాబ్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, ముఠాజైసింహ, తదితరులు


నాగమయ్యకుంట అభివృద్ధికి సహకరిస్తా



సాయిలును సన్మానించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, తదితరులు

రాంనగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్‌లోని నాగమయ్యకుంట బస్తీ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు. నాగమయ్యకుంట బస్తీ కమిటీ అధ్యక్షుడిగా నాలుగోసారి ఎన్నికైన కె.సాయిలు కమిటీ సభ్యులతోపాటు సోమవారం కిషన్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాయిలును కిషన్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు గోవర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బస్తీనాయకులు లక్ష్మణ్ పాల్గొన్నారు.

'పూర్తిస్థాయిలో డివిజన్ కమిటీలను నియమించాలి'



హనుమాన్ ఆలయంలో బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, కార్పొరేటర్ సుప్రియా, కుమార్ ముదిరాజ్

ముషీరాబాద్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రతి డివిజన్‌కు బీజేపీ పూర్తిస్థాయి కమిటీలను నియమించాలని బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ అన్నారు. సోమవారం ముషీరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంచి ముదిరాజ్ ఆధ్వర్యంలో భరత్‌గౌడ్, స్థానిక కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ బాపూజీనగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా అభయ ఆంజనేస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానికులతో కలిసి టిఫిన్ పే చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్‌గౌడ్, సుప్రియా నవీన్‌గౌడ్‌లను కంచి కుమార్ ముదిరాజ్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జమాల్‌పురి నందు, సత్యనారాయణ, బీజేపీవైఎం నగర కార్యదర్శులు అనిల్‌కుమార్, కుషాల్‌గౌడ్, డివిజన్ మాజీ అధ్యక్షుడు బద్రినారాయణ, పార్టీ నాయకులు అజయ్‌గుప్తా, నర్సింగ్‌రావు, లక్ష్మణ్, బిజ్జి రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.


విజయవంతంగా కులగణన సర్వే : టీజేఎస్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణాలో కులగణన సర్వేను కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించిందని టీజేఎస్ ముషీరాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. చిక్కడపల్లిలో సోమవారం ఆయన మాట్లాడారు. సామాజిక, ఆర్థిక, విద్య ఉపాధి, రాజకీయ కుల సర్వే పేరుతో నిర్వహించిన ఈ సర్వేలో బీసీల జనాభా 46శాతంగా తేలిందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి దమ్ముంటే దేశవ్యాప్తంగా కులగణన చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

బీజేపీకి కార్యకర్తలే బలం : ఎంపీ లక్ష్మణ్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బీజేపీకి కార్యకర్తలే బలమని ఆ పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. ఇటీవల అస్వస్థతకు గురైన బీజేపీ యువనేత దోనేటి సత్యంను జవహర్‌నగర్‌లోని ఆయన నివాసంలో డా. లక్ష్మణ్‌తో పాటు బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్, బీజేపీ సికింద్రాబాద్ జిల్లా జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



అధికారులతో పెండింగ్ అభివృద్ధి పనులపై చర్చిస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగంలో పెండింగ్‌లో ఉన్న డివిజన్ అభివృద్ధి పనులను పూర్తి చేయాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ సూచించారు. డివిజన్‌లోని పలు బస్తీల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల విషయంలో సోమవారం జవహర్‌నగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ సర్కిల్ 15 ఇంజనీరింగ్ డీఈ గీత, ఏఈ అబ్దుల్‌సలామ్‌లతో కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, ఇంజనీరింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్ పాల్గొన్నారు.

లోప్రెషర్ సమస్యను పరిష్కరించండి



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

బర్కత్ పుర, ఫిబ్రవరి 24 (ఆంధ్ర జ్యోతి): కాచిగూడ డివిజన్‌లో తాగునీటి సరఫరాలో లో ప్రెషర్ సమస్యను వెంటనే పరిష్కరించాలని జలమండలి అధికారులకు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి సూచించారు. సోమవారం డివిజన్ పరిధిలోని సునార్‌గల్లీ, హనుమాన్ టెంపుల్ లేన్ తదితర ప్రాంతాల్లో నల్లాల ద్వారా నీటి సరఫరా లోప్రెషర్‌తో వస్తుండటంతో స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. కార్పొరేటర్ జలమండలి అధికారులతో ఆయా బస్తీలలో పాదయాత్ర నిర్వహించి సమస్యను అడిగి తెలుసుకున్నారు. లోప్రెషర్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఏఈ భావన, మేనేజర్ వెంకటేష్ యాదవ్, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షులు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు శ్రీనివాస్, దీపక్, రాము, బీంరాజ్, ఆర్.సంతోష్, రవి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

'బీసీ కులగణనలో ప్రజలందరూ పాల్గొనాలి'



టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన నాగభూషణం, కృష్ణాగౌడ్

రాంనగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28వరకు కొనసాగనున్న బీసీ కులగణన సర్వేలో ప్రజలందరూ పాల్గొనే విధంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్ సూచించారు. అంబర్‌పేట నియోజకవర్గంలో జరుగుతున్న బీసీ కులగణనకు సంబంధించిన వివరాలను రాష్ట్ర కనీస వేతనాల సలహామండలి మాజీ చైర్మన్ జి.నాగబూషణం, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణాగౌడ్ ఆయనను కలిసి వివరించారు.

'భగత్‌సింగ్ యువజనోత్సవాలను జయప్రదం చేయండి'

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 23 నుంచి మార్చి 23 వరకు జరుగుతున్న భగత్‌సింగ్ యువజనోత్సవాలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆయా జిల్లా కమిటీల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ యువజనోత్సవాల ఆహ్వాన సంఘాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డీవైఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి జేకే శ్రీనివాస్ చైర్మన్‌గా ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎండీ జావిద్, కోశాధికారిగా అశోక్‌రెడ్డితో పాటు మహేందర్, శ్రీనివాసరావు, వెంకటేష్, మహేందర్, వీరయ్య, లెనిన్, హస్మిబాబు, రమ్యను ఎన్నుకున్నారు.

'బహుముఖ కార్యకలాపాలకు కేంద్ర బింధువు టీపీఎస్‌కే'

రాంనగర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): బహుముఖ కార్యకలాపాలకు కేంద్ర బింధువు తెలంగాణ ప్రజా సాంస్కృతిక వేదిక అని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.డీ అబ్బాస్ పేర్కొన్నారు. సోమవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో టీపీఎస్‌కే రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. వేదిక అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అబ్బాస్ ముఖ్యాతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్థిక, రాజకీయ ఉద్యమాలే కాకుండా సామాజిక, సాంస్కృతిక మేధావులను కూడా ప్రభావితం చేసేలా వేదిక పనిచేయాలని సూచించారు. వేదిక అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మార్చి 6న ఆధ్యాత్మిక రంగం పేరిట కృషి, భజన కోలాటం కళాకారులు అనే అంశంపై ఎంబీ భవన్‌లో వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్చి 8న మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్చి 23న భగత్‌సింగ్ వర్ధంతి, ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి కార్యక్రమాలు జరుగుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్‌కే సభ్యులు జి.రాములు, హిమబిందు. యాదగిరిరావు రమేష్, నరేష్, శ్రీమన్నారయణ, తదితరులు పాల్గొన్నారు.

యువతిపై అత్యాచారం.. యువకుడి అరెస్ట్

బర్కత్‌పుర, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు అత్యాచారానికి పాల్పడటమే గాక బంగారు నగలు, నగదు తీసుకుని మోసగించిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కాచిగూడ ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపిన ప్రకారం.. కరీంనగర్ జిల్లా పెద్దపల్లికి చెందిన లక్కాకుల శ్రావణ్‌కుమార్(33) ముషీరాబాద్‌లో ఉంటూ ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో ఓ యువతి(25)తో పరిచయం ఏర్పడింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమె వద్ద ఉన్న రూ.11 లక్షల విలువగల బంగారు ఆభరణాలు, నగదును తీసుకున్నాడు. ఆ తర్వాత మొహం చాటేశాడు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. శ్రావణ్‌కుమార్‌పై రేప్, చీటింగ్ కేసు నమోదు చేసి సోమవారం రాత్రి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు.

గ్యాస్ లీకై ఇంట్లో మంటలు

నిత్యావసరాలు, సామగ్రి దగ్ధం

బర్కత్‌పుర, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ వీరన్న గుట్టలోని ఓ ఇంట్లో గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. ఫైర్‌సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలు ఆర్పివేశారు. కాచిగూడ పోలీస్‌స్టేషన్ అడ్మిన్ ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. వీరన్నగుట్టలో నేపాల్ దేశానికి చెందిన తిలక్‌ప్రసాద్, లక్ష్మి దంపతులు నివాసం ఉంటున్నారు. కాచిగూడ రైల్వేస్టేషన్ ఎదురుగా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం సాయంత్రం 3 గంటల సమయంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నుంచి లక్ష్మి ఇంటికి వచ్చి తలుపుతీయగా మంటలు, పొగ బయటకు వచ్చాయి. వెంటనే స్థానికులతో కలిసి ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేయడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న నిత్యావసరాలు, దుస్తులు పూర్తిగా దగ్ధమయ్యాయి. రూ. 50వేల విలువగల వస్తువులు కాలిపోయాయని తిలక్‌ప్రసాద్ తెలిపారు.